క్లుప్తంగా

సన్మానం



భూపాలపల్లి అర్బన్: భారత జాగృతి జిల్లా అధ్యక్షుడిగా ఎన్నికైన మాడ హరీష్‌రెడ్డిని స్థానిక జాగృతి నాయకులు జిల్లా కేంద్రంలో ఆదివారం ఘనంగా సన్మానించారు. జిల్లా అధ్యక్ష పదవి అప్పగించడంపై వ్యవస్థాపక అధ్యక్షురాలు కవితకు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో నాయకులు మహేష్, గణేష్, అభిలాష్‌రెడ్డి, సందిప్‌గౌడ్, వంశీ, ప్రశాంత్, గణేష్, రాజుకుమార్ పాల్గొన్నారు.

రోడ్డు పనులు ప్రారంభం



వెంకటాపురం(కె): మండల పరిధిలోని వీఆర్కెపురం పంచాయతీలోని ఎస్సీ కాలనీలో సీసీ రోడ్డు పనులను జెడ్పీటీసీ పాయం రమణ ఆదివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. రూ.ఐదు లక్షల ఉపాధిహామీ నిధులతో సీసీ రోడ్డు నిర్మిస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ అధికార ప్రతినిధి డర్రా దామోదర్, నాయకులు శివాజి, ఆదినారాయణ, తదితరులు ఉన్నారు.

గీత కార్మికుడికి గాయాలు



వెంకటాపురం(ఎం): తాటి చెట్టు పైనుంచి జారి పడి గీత కార్మికుడికి గాయాలైన సంఘటన మండలంలోని మండలంలోని లక్ష్మీదేవిపేట గ్రామంలో ఆదివారం సాయత్రం చోటుచేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన కొండ శివప్రసాద్ వృత్తిలో భాగంగా తాటి చెట్టు ఎక్కుతున్న క్రమంలో ప్రమాదవశాత్తు జారిపడ్డాడు. గమనించిన తోటి గీత కార్మికులు స్థానిక ప్రైవేటు ఆస్పత్రికి తరలించి ప్రథమ చికిత్స అందించారు. పక్కటెముకలకు తీవ్ర గాయాలు కావడంతో మెరుగైన చికిత్స కోసం హనుమకొండలోని ప్రైవేట్ ఆస్పత్రికి తరలించారు. బాధిత కుటుంబాన్ని ప్రభుత్వం అన్ని విధాల ఆదుకోవాలని గీత కార్మిక సంఘం అధ్యక్షుడు పెరుమాండ్ల పున్నం, సర్పంచ్ గట్టు కుమారస్వామి కోరారు.

ఆర్థిక సాయం



ములుగు రూరల్: మండలంలోని మదనపల్లి గ్రామంలో అగ్ని ప్రమాదంలో సర్వం కోల్పోయిన కుతుబొద్దీన్ కుటుంబానికి ప్రభుత్వం ఆర్థిక సాయం అందజేశారు. ఈ మేరకు తహసీల్దార్ ఆదేశాల మేరకు ఆర్ఐ విజేందర్ ఆదివారం బాధిత కుటుంబానికి రూ.5 వేల ఆర్థిక సాయంతో నిత్యావసర సరుకులు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రభుత్వం నుంచి అందిచవలసిన తక్షణ సాయం అందించామని అన్నారు. పూర్తి స్థాయిలో బాధిత కుటుంబానికి అందవలసిన సాయం త్వరలో అందిస్తామని అన్నారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ పోరిక రాంకుమార్‌పాయక్, ఎంపీటీసీల ఫోరం జిల్లా అధ్యక్షుడు పోరిక విజయ్‌రాంనాయక్, గ్రామస్తులు ఉన్నారు.

జాతరకు పోయేదెలా?

- చల్లగరిగ నుంచి కోటంచ జాతరకు వెళ్లేందుకు భక్తుల ఇబ్బందులు
- గుంతలమయంగా రోడ్లు, ఇరువైపులా తుమ్మ పొదలు
- పట్టించుకోని అధికారులు, పాలకులు

రేగొండ మండలంలోని కొడవటంచ శ్రీలక్ష్మీనరసింహస్వామి జాతరకు రాష్ట్రం నలుమూలల నుంచి భక్తులు అధిక సంఖ్యలో వస్తుంటారు. జాతర సందర్భంగా ఈనెల 7, 8, 9న నిర్వహించే కార్యక్రమాలకు భక్తులు పెద్ద ఎత్తున తరలివస్తారు. జాతరకు వచ్చే భక్తులు ఎక్కువగా చిట్యాల మండలంలోని చల్లగరిగ నుంచి ఆలయానికి చేరుకోవాలి. దాదాపు మూడు కిలోమీటర్లు ఉన్న ఈ రోడ్డు గుండా ఆలయానికి వెళ్లాలంటే భక్తులకు దేవుడు గుర్తుకువస్తున్నాడు. గుంతలు, తుమ్మ పొదలతో ప్రయాణికుల ఇబ్బంది ఇంతా అంతా కాదు. -చిట్యాల



రోడ్డుకు ఇరువైపులా ఉన్న తుమ్మ పొదలు

మండలంలోని చల్లగరిగ నుంచి రేగొండ మండలంలోని కోడవటంచ శ్రీలక్ష్మీనరసింహస్వామి జాతరకు వెళ్లే రహదారి సరిగా లేక భక్తులు ఇబ్బందులు పడుతున్నారు. గత సంవత్సరంలో కూడా నామామంత్రంగా రోడ్డు పోసి చేతులు దులుపుకున్నారు. జాతరలో ఈ నెల 7 హోళీ సందర్భంగా బండ్లు తిరుగుట ప్రారంభం అవుతుంది. ఈ సందర్భంగా చిట్యాల, టేకుమట్ల, మొగుళ్లపల్లి, కరీంనగర్, జమ్మికుంట తదితర ప్రాంతాల నుంచి చల్లగరిగ గ్రామం మీదుగా కోడవటంచ జాతరకు వాహనాల్లో, ఎండ్ల బండ్లలో వెళ్తుంటారు. కాని రోడ్డుకు ఇరువైపుల తుమ్మ పొదలు ఉండడంతో వాహనాలకు తగిలే ప్రమాదం ఉంది. అలాగే రోడ్డు పక్కన ప్రమాదకరంగా బావి, రోడ్డుపై గుంతలు ఉన్నాయి. కనీసం వాటి చుట్టూ హెచ్చరిక బోర్డులు పెట్టిన దాఖలాలు లేవు. ప్రమాదం జరిగితేనే పట్టించుకుంటారా అని పలువురు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. అధికారులు, పాలకులు కనీసం పట్టించుకోవడం లేదని వాపోతున్నారు. గతంలో ఎప్పుడో ఈ రోడ్డుపై తారు రోడ్డు వేశారు. అప్పటి నుంచి ఇప్పటి వరకు ఈ రోడ్డుకు మోక్షం కలుగలేదు. కోడవటంచ జాతరకు ఈ నెల 7, 8, 9న భక్తులు అధిక సంఖ్యలో రానున్నారు. ఈ గతుకుల రోడ్డుపై భక్తులు ఏలా వెళ్తారని ఏదైన ప్రమాదం జరుగుతే ఎవరు బాధ్యులని స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. పాలకులకు ఈ రోడ్డు కనబడటం లేదా అని ప్రశ్నిస్తున్నారు. ఇప్పటికైన అధికారులు, పాలకులు స్పందించి చల్లగరిగ, కోడవటంచ మధ్య డబుల్ రోడ్డు వేయాలని భక్తులు డిమాండ్ చేస్తున్నారు.

రోడ్డు సౌకర్యం కల్పించాలి



కోడవటంచలో జరిగే శ్రీలక్ష్మీనరసింహా స్వామి జాతరకు వేలాది మంది భక్తులు చల్లగిరిగ రోడ్డుపై వెళ్తుంటారు. కాని రోడ్డు సౌకర్యం సరిగా లేక పోవడంతో భక్తులు అనేక ఇబ్బందులు పుడుతున్నారు. కావున అధికారులు స్పందించి భక్తులకు మెరుగైనా రోడ్డు సౌకర్యం కల్పించాలి.

- గడ్డం కొమురయ్య, కాంగ్రెస్ పార్టీ మండల ప్రధాన కార్యదర్శి



ప్రమాదకరంగా ఉన్న బావి



రోడ్డుపై తేలిన కంకర



గతుకుల రోడ్డుపై పోసిన మొరం

పార్కింగ్ స్థలాల్లోనే వాహనాలు నిలపాలి

టేకుమట్ల(రేగొండ): రేగొండ మండలంలోని కోటంచ శ్రీలక్ష్మీనరసింహస్వామి బ్రహ్మోత్సవాల సందర్భంగా ఆలయ కమిటీ, పోలీసులు నిర్దేశించిన పార్కింగ్ స్థలాల్లోనే వాహనాలు నిలుపాలని రేగొండ ఎస్సై శ్రీకాంత్‌రెడ్డి సూచించారు. ఆదివారం కోటంచలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. హైదరాబాద్, వరంగల్, చిట్యాల, జమ్మికుంట ప్రాంతాల నుంచి వచ్చే భక్తులు తమ వాహనాలను ప్రధాన ఆర్చి నుంచి ఆలయానికి చేరుకున్నాక ప్రదక్షిణ అనంతరం 1 టవర్ పార్కింగ్, 2 పార్కింగ్ ట్రయాంగిల్‌లో మామిడి తోటలో ఏర్పాటు చేసిన పార్కింగ్‌లో వాహనాలను నిలిపివేయాలని సూచించారు. అలాగే భూపాలపల్లి నుంచి భాగిర్తిపేట మీదుగా వచ్చే వాహనదారులు పోచమ్మ గుడికి చేరుకుని, అక్కడి నుండి ఆలయంలో ప్రదక్షిణలు చేసిన అనంతరం పార్కింగ్ 3 ఈస్ట్ మెయిన్, పార్కింగ్ 4 బందం పార్కింగ్‌లో వాహనాలను నిలుపుకోవాలన్నారు. అలాగే ఉన్నత పాఠశాలతో పాటు, కొమురారెడ్డి మామిడి తోటలో పార్కింగ్ ఏర్పాటు చేశారు కావున పార్కింగ్ స్థలాల్లోనే వాహనాలను నిలిపలని ప్రయాణికులతకు తెలిపారు. జాతరలో భక్తుల తాకిడి ఎక్కువగా ఉంటుంది కావున చిన్న పిల్లలు, విలువైన వస్తువులపై అప్రమత్తంగా ఉండాలన్నారు. పోలీసుల సహాయం కోసం 8712658123 నంబర్‌ను సంప్రదించాలని కోరారు.

ప్రశాంతంగా ముగిసిన ప్రవేశపరీక్ష

చిట్యాల: మండలంలో సాంఘిక సంక్షేమ గురుకులాల ఇంటర్, డిగ్రీ కళాశాలలో ప్రవేశాలకు జరిగిన అర్హత పరీక్ష ప్రశాంతంగా ముగిసినట్లు ప్రిన్సిపాల్ గోల్కొండ భిక్షపతి తెలిపారు. ఆదివారం ఉదయం జరిగిన ఇంటర్మీడియేట్ ప్రథమ సంవత్సరంలో ప్రవేశానికి సీఈఓ సెట్‌కు 400 మంది దరఖాస్తు చేసుకోగా 372 మంది విద్యార్థులు హాజరైనట్లు వెల్లడించారు. తెలంగాణ సాంఘిక సంక్షేమ గురుకులాలో డిగ్రీ మొదటి సంవత్సరంలో ప్రవేశాలకు 390 మంది విద్యార్థులు దరఖాస్తు చేసుకోగా ప్రవేశ పరీక్షకు 372 మంది విద్యార్థులు హాజరైనట్లు తెలిపారు. ఈ ప్రవేశ పరీక్షలకు డిపార్ట్‌మెంట్ అధికారి మైథిలి పర్యవేక్షణలో జరిగినట్లు ప్రిన్సిపాల్ వెల్లడించారు.



ప్రవేశపరీక్షకు హాజరైన విద్యార్థినులు

అపరిచితులకు ఆశ్రయం ఇవ్వొద్దు



మాట్లాడుతున్న ఎస్సై లక్ష్మణ్‌రావు

కాళేశ్వరం: మహదేవపూర్ మండలం నాగేపల్లి, చంద్రుపల్లి గ్రామాల్లో ఎస్సై లక్ష్మణ్‌రావు ఆధ్వర్యంలో కమ్యూనిటీ కాంటాక్ట్ ప్రోగ్రాం నిర్వహించారు. ఆదివారం తెల్లవారుజామున ఆయా గ్రామాల్లో ప్రజలతో మమేకమై సోదాలు, తనిఖీలు చేశారు. అనుమానితులు కనిపిస్తే విచారించి వదిలేశారు. ఈ సందర్భంగా ఎస్సై మాట్లాడుతూ.. గ్రామాల్లో అపరిచిత వ్యక్తులకు ఆశ్రయం ఇవ్వొద్దన్నారు. గ్రామాల్లో కొత్త వ్యక్తులు సంచరిస్తే వెంటనే తమకు సమాచారం తెలుపాలన్నారు. యువత బాగా చదువుకొని ఉన్నత శిఖరాలను అధిరోహించాలన్నారు. ఆయన వెంట టీఎస్ఎస్పీ పోలీసులు ఉన్నారు.

అనుమతులు ఎప్పడొస్తాయో?

- రోడ్డు నిర్మాణం కోసం ప్రజల ఎదురుచూపులు
- నిర్మాణం పూర్తయితే తగ్గనున్న దూర భారం

మల్హర్: మండలంలోని పెదతూండ్ల, కిషన్‌రావుపల్లి నుంచి భూపాలపల్లి వరకు ఉన్న ఫారెస్టులో రోడ్డు నిర్మాణం కోసం సంవత్సరాలుగా మండల ప్రజలకు ఎదురుచూపులు తప్పడం లేదు. అటవీ శాఖ అనుమతులు రావాల్సి ఉండగా వస్తాయో, రావో అని ప్రజలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. భూపాలపల్లి పారిశ్రామికంగా అభివృద్ధి చెందడంతో పాటు జిల్లా కేంద్రం కావడంతో పెద్ద సంఖ్యలో నిత్యం రాకపోకలు సాగుతున్నాయి. మండల కేంద్రం తాడిచర్ల మానేరుపై చేపడుతున్న నిర్మాణం పూర్తయి అందుబాటులోకి వచ్చింది. ఈ నేపథ్యంలో అటవీశాఖ అనుమతులు వస్తే ప్రజలకు రవాణా సౌకర్యం మెరుగుపడడంతో పాటు ఈ రహదారి మరింత ప్రధాన్యం సంతరించుకోనుంది.

తగ్గనున్న దూరాభారం

తాడిచర్ల, మల్లారం, పెదతూండ్ల, చిన్నతూండ్ల తదితర గ్రామాల ప్రజలు జిల్లా కేంద్రానికి మంథని నుంచి వెళ్లడానికి 60 కిలోమీటర్ల మేర ప్రయాణించాల్సి ఉండగా ఈ రోడ్డు పూర్తి అయితే కేవలం 32 మీలోమీటర్ల ప్రయాణించి చేరుకోవచ్చు. ఇప్పటికైనా జిల్లా అధికారులు స్పందించి పనులు పూర్తి అయ్యేలోగా అనుమతులు ఇవ్వాలని ప్రజలు కోరుకుంటున్నారు.



కిషన్‌రావుపల్లి-భూపాలపల్లి అటవీ ప్రాంత రహదారి

నివేదిక సమర్పించాం..

కిషన్‌రావుపల్లి అటవీ ప్రాతంలో రోడ్డు నిర్మాణం చేపట్టడానికి ఇప్పటి వరకు ప్రభుత్వం నుంచి ఎలాంటి అనుమతులు రాలేదు. దీనిపై అటవీ శాఖ నుంచి ప్రభుత్వానికి నివేదిక సమర్పించాం.

- కిరణ్‌కుమార్, కొయ్యూర్ రేంజర్, మల్హర్

త్వరలో మున్నూరు కాపు ట్రస్టు భవన నిర్మాణం



సమావేశంలో పాల్గొన్న ట్రస్టు సభ్యులు

కాళేశ్వరం: మహదేవపూర్ మండలం కాళేశ్వరంలో కాళేశ్వరముక్తీశ్వరస్వామి ఆలయంఒ మున్నూరు కాపు నిత్యన్నదాన ట్రస్టు భవనం నిర్మాణానికి త్వరలో భూమి పూజ నిర్వహించనున్నట్లు ట్రస్టు చైర్మన్ బండి సంజీవ్ తెలిపారు. ఆదివారం కాళేశ్వరంలో ట్రస్టు మొదటి సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. 5వేల మందితో మే లేదా జూన్‌లో భవన నిర్మాణానకి భూమి పూజ నిర్వహిస్తామన్నారు. డిసెంబర్‌లోపు భవన నిర్మాణం పూర్తి చేయడానికి కృషి చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో ట్రస్టు సభ్యులు రామకృష్ణ, సురేష్, రాజశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యే 'గండ్ర'కు పరాభవం తప్పదు

శాయంపేట : రానున్న ఎన్నికల్లో భూపాలపల్లి ఎమ్మెల్యే గండ్ర వెంకటరమణారెడ్డికి పరాభవం తప్పదని యూత్ కాంగ్రెస్ నాయకుడు మంద శంకర్ హెచ్చరించారు. మండలంలోని పెద్దకోడెపాక గ్రామంలో ఆదివారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఎమ్మెల్యే వెంకటరమణారెడ్డి బీనామి పేర్లతో భూకబ్జాలకు పాల్పడుతూ పేదల భూమిని లాక్కుంటున్నారని ఆరోపించారు. కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి గండ్ర సత్యనారాయణరావు విసిరిన సవాళ్లను ఎమ్మెల్యే వెంకటరమణారెడ్డి స్వీకరిస్తే బహిరంగ చర్చకు రావాల్సి ఉంటుందనే భయంతోనే పోలీసులతో 144 సెక్షన్ పెట్టించి తప్పించుకున్నాడని ఎద్దేవా చేశారు. సమావేశంలో యూత్ కాంగ్రెస్ నాయకులు మంద రాకేష్, నవీన్, అభిరామ్, సంజయ్, రేణిగుంట్ల అశ్విన్, వంశీ తదితరులు పాల్గొన్నారు.

పొదుపుతో ఆర్థిక అభివృద్ధి

శాయంపేట : సంపాదించిన డబ్బులో నుంచి కొంత పొదుపు చేసుకోవడం ద్వారానే ఆర్థిక అభివృద్ధి సాధించగలమని శ్రీ వెంకటేశ్వర పురుషుల పొదుపు సంఘం అధ్యక్షుడు మహ్మద్ ఉస్మాన్ స్పష్టం చేశారు. మండలంలోని ప్రగతిసంగారం గ్రామంలో సంఘం అధ్యక్షుడు పెద్దిరెడ్డి మహేందర్ రెడ్డి అధ్యక్షతన ఆదివారం నిర్వహించిన 18వ వార్షిక మహాసభకు ఉస్మాన్ ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. 2005లో 105 మంది సభ్యులు, రూ.10,500తో సంఘం ప్రారంభమై ప్రస్తుతం 266 మంది సభ్యులతో సొంత భవనం కలిగి రూ.56 లక్షల నిధులతో అభివృద్ధి పథంలో సాగుతోందని తెలిపారు. సమాజంలోని ప్రతిఒక్కరికీ ఆర్థిక అవసరాలుంటాయని చెప్పారు. డబ్బును పొదుపు చేసుకోవడం ద్వారా భవిష్యత్ అవసరాలకు ఇబ్బంది లేకుండా చూసుకోవాలని సూచించారు. అనంతరం సంఘం నూతన మండల అధ్యక్షుడిగా పెద్దిరెడ్డి మహేందర్‌రెడ్డిని, ఉపాధ్యక్షుడిగా చిలుకల రాజన్నను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. కార్యక్రమంలో సంఘ పాలకవర్గ సభ్యులు, సభ్యులు తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న ఉస్మాన్

ముగిసిన క్రికెట్ టోర్నమెంట్

వెంకటాపురం(కె): మండల కేంద్రంలోని కాఫెడ్ క్రీడా మైదానంలో కేవీఆర్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న క్రికెట్ టర్నమెంట్ ఆదివారం ముగిసింది. ఫైనల్ మ్యాచ్‌లో కొంగాల, ఆలుబాక జట్లు పోటిపడగా ఆలుబాక జట్టు విజయం సాధించింది. మొదటి బహుమతి రూ.20,116, ద్వితీయ బహుమతి రూ.15,116, తృతీయ స్థానంలో నిలిచిన వెంకటాపురం జట్టుకు 10,116 షీల్డు ను కేవీఆర్ ఫౌండేషన్ అధ్యక్షుడు కొర్సా వెంకటేశ్వరావు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఏటీఏ రాష్ట్ర అధ్యక్షుడు బోదేబోయిన పరమేశ్వరావు, నాగయ్య, సతీష్, నూపా నాగేశ్వరావు తదితరులు ఉన్నారు.



బహుమతులు అందుకుంటున్న క్రీడాకారులు

సమస్యలు పరిష్కరించాలి

మొగుళ్లపల్లి: విద్యుత్ అన్ మ్యాన్డ్ కార్మికుల సమస్యలతో పాటు ఆర్టిజన్ కార్మికుల సమస్యలను గుర్తించి యజమాన్యం వెంటనే పరిష్కరించాలని ఐఎన్‌టీయూసీ 327 డివిజన్ ఉపాధ్యక్షుడు తిప్పారపు రాజు, అన్‌మ్యాన్డ్ డిస్ట్రిబ్యూషన్ జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ వేముల కిరణ్‌గౌడ్ కోరారు. మండల కేంద్రంలో ఆదివారం ఏర్పాటు చేసిన సమావేశంలో వారు మాట్లాడుతూ.. సోమవారం హైదరాబాద్‌లో యజమాన్యంతో జరగబోయే చర్చల్లో అన్‌మ్యాన్డ్, ఆర్టిజన్ కార్మికుల సమస్యలను గుర్తించి పరిష్కారానికి చొరవ చూపాలన్నారు.

చలివేంద్రం ప్రారంభం



చలివేంద్రం ప్రారంభిస్తున్న సర్పంచ్

మహదేవపూర్: మండలంలోని బస్టాండ్ ఆవరణలో చెన్నూర్ గ్రామవాసి గఫార్ ఏర్పాటు చేసిన చలివేంద్రంను సర్పంచ్ శ్రీపతిబాపు ఆదివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ.. ప్రజల కోసం గఫార్ చలివేంద్రం ఏర్పాటు చేయడం అభినందనీయం అన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ ఉప సర్పంచ్ షాహీన్ ఖాన్, నాయకులు మెరుగు లక్ష్మణ్, చిలుక రమేష్, సలీంఖాన్‌తో పాటు గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

గొప్ప రాజకీయ నాయకుడు 'నల్లెల'

ములుగు: పదవి ఉన్నా లేకున్నా నిత్యం ప్రజల మధ్యలో ఉండి వారికి అండగా నిలిచిన గొప్ప రాజకీయ నాయకుడు నల్లెల కుమారస్వామి అని ఎమ్మెల్యే సీతక్క అన్నారు. ఆదివారం జిల్లాకేంద్రంలో నిర్వహించిన నల్లెల కుమారస్వామి దశదినకర్మకు ధనసరి సీతక్క హాజరయ్యారు. కుటుంబ సభ్యులను ఓదార్చారు. అనంతరం ఏర్పాటు చేసిన సంతాప సభలో ముందుగా రెండు నిమిషాల పాటు మౌనం పాటించారు. ఈ సందర్భంగా సీతక్క మాట్లాడుతూ.. విద్యార్థి దశ నుంచి ప్రజల మధ్యలో ఉంటూ జిల్లా అధ్యక్ష పదవి వరకు ఎదిగారని అన్నారు. కుమారస్వామి మృతి పార్టీకి తీరనిలోటని అన్నారు. నల్లెల లేక ములుగు కాంగ్రెస్ మూగబోయినట్లుగా అయ్యిందని అన్నారు. మాట్లాడుకుంటూనే కన్నీటి పర్యంతం అయ్యారు. కాంగ్రెస్ పార్టీ నాయకులు సమకూర్చిన ఆర్థిక సాయాన్ని నల్లెల కుటుంబ సభ్యులకు అందించారు. ఈ కార్యక్రమంలో టీపీసీసీ కార్యదర్శి పైడాకుల అశోక్, కిసాన్ కాంగ్రెస్ అధ్యక్షుడు గొల్లపల్లి రాజేందర్‌గౌడ్, యూత్ కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు బానోత్ రవిచందర్, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు ఇర్సవడ్ల వెంకన్న, ఆయా సంఘాల ఇన్‌చార్జ్‌లు మండలాల బాధ్యులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఎమ్మెల్యే ధనసరి సీతక్క

బియ్యం అందజేత

ములుగు రూరల్(గోవిందరావుపేట): గోవిందరావుపేట మండల కేంద్రానికి చెందిన సామినేని సమ్మక్క ఇటీవల అనారోగ్యంతో మృతి చెందింది. దీంతో బాధిత కుటుంబాన్ని తెలంగాణ ప్రజా సేన అధ్యక్షుడు బొమ్మకంటి రమేష్ ఆదివారం పరామర్శించి బియ్యం అందజేశాడు. ఆయన వెంట దేవిరెడ్డి వెంకట్‌రెడ్డి, జన్ను రమేష్, గోపాల్, సదయ్య, వంశీ, శ్రీను, కొమురయ్య ఉన్నారు.

అగ్గి రాజుకుంటే బుగ్గే

- ముదురుతున్న ఎండలతో పొంచి ఉన్న ప్రమాదం
- అగ్నిమాపక కేంద్రం ఏర్పాటుపై అధికారుల అలసత్వం
- భద్రాచలం నుంచి ఫైర్ ఇంజన్ వచ్చేలోగానే తీవ్ర నష్టం



కాలి బూడిదైన ఇల్లు(ఫైల్)

వాజేడు: వేసవి కాలంవచ్చిందంటే చాలు ఏజెన్సీ ప్రాంతల ప్రజలు అగ్ని ప్రమాదాలపై ఆందోళన చెందుతుంటారు. ఏజెన్సీలో ఎక్కువగా పూరి గుడిసెలు ఉండటంతో అగ్ని ప్రమాదం జరిగితే సర్వస్వం కోల్పోతున్నారు. వెంకటాపురం(కె) సబ్‌డిజన్‌లో అగ్నిమాపక కేంద్రాన్ని ఏర్పాటు చేసేందుకు 24 ఏళ్ల క్రితమే అడుగులుపడ్డాయి. కాని ఇంతవరకు దాని ఊసే లేకుండా పోయింది. ప్రతీ సంవత్సరం వేసవి కాలంలో వాజేడు, వెంకటాపురం(కె) మండలాల్లో భారీ సంఖ్యలో ఇళ్లు అగ్నికి ఆహుతి అవుతున్నాయి. వెంకటాపురం(కె) మండలంలోని ఆలుబాకలో గతంలో వరుసగా రెండు సంవత్సరాలు జరిగిన అగ్ని ప్రమాదంలో భారీ సంఖ్యలో ఇళ్లు కాలి బూడిదయ్యాయి. భద్రాచలం అగ్నిమాపక కేంద్రం నుంచి ఫైరింజన్ వచ్చి మంటలను ఆర్పేలోగా జరుగాల్సిన నష్టం జరిగిపోయింది. భద్రాచలానికి వాజేడు 120, వెంకటాపురం(కె) 100 కిలోమీటర్ల దూరంలో ఉంటాయి. అక్కడి నుంచి ఫైరింజన్ వచ్చే లోగానే ఇంటి స్థానంలో బూడిద మిగులుతోంది. దీంతో ఈ ప్రాంతానికి అగ్నిమాపక కేంద్రం ఆవశ్యకతను గుర్తించిన గతంలో వెంకటాపురం(కె) కేంద్రంగా అగ్నిమాపక కేంద్రాన్ని ఏర్పాటు చేయడానికి కసరత్తులు చేశారు. త్వరలోనే ఏర్పాటు చేస్తారని ఆశించిన ప్రజలకు బంగపాటు మిగిలింది. ఈ సంవత్సరం ఇప్పటి నుంచే ఎండలు పెరుగుతుండటంతో ఏ సమయంలో అగ్ని ప్రమాదాలు సంభవిస్తాయోనని ప్రజలు భయాందోళనకు గురవుతున్నారు. రెండు మండలాల ప్రజలు వెంకటాపురం(కె) కేంద్రంగా అగ్నిమాపక కేంద్రాన్ని ఏర్పాటు చేయాలని అందుకు అనుగుణంగా అధికారులు చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

చర్య తీసుకోవాలి

టేకుమట్ల(రేగొండ): రేగొండ మండలంలోని రంగయ్యపల్లిలో జరిగిన రోడ్డు ప్రమాదంలో రాయపల్లి గ్రామానికి చెందిన దాసరి రాజిరెడ్డి అనే వ్యక్తి మృతి చెందాడు. దీంతో బాధిత కుటుంబాన్ని సీపీఎం జిల్లా నాయకులు పసుల వినయ్ ఆదివారం పరామర్శించి, తన ప్రగాఢ సానుభూతిని తెలిపారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. ఈ ప్రమాదానికి కారణమైన వాహన యాజమాన్యంపై చర్య తీసుకోవాలని అధికారులను డిమాండ్ చేశారు. అనుభవం, డ్రైవింగ్ లైసెన్స్ లేని డ్రైవర్లతో వాహనాలను నడిపిస్తూ ఒక వ్యక్తి మృతికి కారణమైనారని మండిపడ్డారు. రాజిరెడ్డి కుటుంబానికి తగిన న్యాయం చేయకుంటే సీపీఎం ఆధ్వర్యంలో ఆందోళన కార్యక్రమాలు చేపడుతామని హెచ్చరించారు.



పరామర్శిస్తున్న పసుల వినయ్